# సంపూర్ణం

వేదాంతం శ్రీపతి శర్మ

సుందరం బేవార్స్‌గా పడుకుని వున్నాడు. తన జోలికి ఎవరూ రారు. అతనా ఎవరి జోలికీ వెళ్లడు. అందుచేత 'చాలా మంచి వాడు' అనే బిరుదు కొద్ది సంవత్సరాల క్రితం తనకి తాను ఇచ్చేసుకున్నాడు.



ఏ ఉద్యోగం లేనివాడు తను వ్యాపారినని చెప్పుకోవటం, ఇంటిలో లెక్కర్లు ఇచ్చేసి నేను 'ఇంటలెక్చుపల్'నని చాటుకోవటం, తెలుగు సినిమా చూసేసి కొద్దిసేపు నడక మార్చేసి నడవటం సర్వసాధారణంగా జరుగుతోంది.

ఎన్నో హంగులకు పోతూ కూడా పెద్ద ఆఫీసరు గారు ఎందుకో కొత్త మనిషికి 'నేను చాలా సింపుల్' అని చెప్పుకుంటూ వుంటాడు.

ఒకరికి దురదగా వుంటే మరొకడిని గోకటం, తన ఆదుర్దాని ఇంకొకడి బాధగా వర్ణించటం, చేతకానితనాన్ని భౌగోళిక సమస్యగా చక్కగా తీర్చిదిద్దటం ఒక చక్కని టాలెంట్. అది అలా ఉంచండి. సుందరం అందుకే 'నువ్వేం చేస్తున్నావోయ్?' అని అడిగితే నిర్మొహమాటంగా 'ఏమీ చెయ్యను' అని చెబుతాడు. 'అలా ఎందుకు చెబుతారండీ? మీరు మంచి రచయిత కదూ?' అని ఎవరైనా అడిగితే, 'సమాజానికి ఏదో శల్య చికిత్స చేద్దామనుకుని ఏమీ చేయలేక ఓడిపోయిన వాడు రచయిత అవుతాడు. నేను ఏదీ వ్రాయని రచయితను.'' అంటాడు. అది నొక్కి వక్కాణించటం కోసం ఆ ఆస్పత్రిలో కాళ్లు జాపుకుని పడుకుని తన గుండె మీద నాలుగైదు పుస్తకాలు పెట్టుకున్నాడు. ఆలోచనలే జీవం పోసుకుని అలా పరుగులు తీస్తే ఈ భూమి మీద చోటు చాలదేమో. అందుకే కాగితం మీద కలం పెట్టకుండా ఏదో ఆలోచించుకుంటూ ఎందుకో నవ్వుకుంటూ, ఇంకేదో తవ్వుకుంటూ ఆ పక్క బెడ్ మీద ఎవడో కెవ్వున ఏడ్చేలోపల ఈ లోకంలోకి వచ్చి మరల పుస్తకం తీస్తున్నాడు. ఈతను పిచ్చివాడో, వెర్రివాడో, మామూలు మనిషో నిర్ధారించేందుకు అప్పుడప్పుడు ఆ ఆస్పత్రిలో చేరుస్తూ వుంటారు.

ఆమధ్య అతన్ని వాళ్ల బాబాయ్ ఆస్పత్రికి తీసుకుని వచ్చి డాక్టర్ ముందు కూర్చోపెట్టాడు. 'మీ పేరేంటి?' అడిగాడు డాక్టర్.

'అయామ్ యోగి..'' అన్నాడు సుందరం. ''మీ దగ్గరకు వచ్చినందుకు రోగిని. పేరు సుందరం.''

ఆ డాక్టర్ చూపు పిచ్చి చూపుగా మారింది. తెలివిగలవాడు కాబట్టి తేరుకున్నాడు. ఒక కాగితం మీద ఏదో చైనీస్ భాషలో వ్రాసినట్లు కొన్ని టాబ్లెట్ల పేర్లు వ్రాశాడు. ''ఈమందులు వాడండి.'' అన్నాడు. ''వచ్చేవారం టెస్టులు జరపాలి. అప్పుడు అడ్మిట్ చేయండి.'' సుందరం కాగితం లాక్కుని చదవటం ప్రారంభించాడు. డాక్టర్ నవ్వాడు. ''సుందరం గారూ, మీరు మిమ్మల్ని యోగి అని ఎందుకు అనుకుంటున్నారు?''

సుందరం ఆ కాగితం తన బాబాయ్‌కి ఇచ్చేశాడు. ''డాక్టర్ గారూ, మీరు నిద్ర లేవగానే మిమ్మల్ని మీరు ఫలానా అని గుర్తు చేసుకునే అవసరం వుండదు. నాకూ వుండదు. నేను ఏదైతే కథలా వ్రాద్దామనుకుంటూ వుంటానో అది నిజమై పోతూ వుంటుంది. అందుకని వ్రాయకుండా కేవలం కథ అనుకుని నిజంగా మారే వరకూ చూస్తూ అలా కాలం గడుపుతూ వుంటాను.''

''కథ వ్రాయటంలో భయం ఎందుకు?''

''కథలో జీవన్మరణాలు వుంటే?''

డాక్టర్ వెనక్కి వాలాడు. ఇతను పిచ్చివాడు కాడు అని అప్పుడే నిర్ధారించాడు.

''మీరు ఊహించినంత మాత్రాన జరుగుతున్న సంఘటనలకు మీకూ సంబంధం లేదు!''

''ఎందుకు లేదు? ఎక్కడో సముద్రం లోని ఉప్పుకూ మీ బ్లడ్ ప్రెషర్‌కీ ఏంటి సంబంధం?''

''ఆలోచిద్దాం. ముందర ఈ మందులు వాడండి.''

ఇద్దరూ ఇవతలకి వచ్చారు. సుందరం తన బాబాయిని అడిగాడు. ''ఈ మందు ఎంత అవుతోంది?''

''ఇరవై వేలు..!''

''ఆ డబ్బు నాకు ఇచ్చేస్తే ఇరవైరోజులు మౌనం పాటిస్తాను. మిమ్మల్ని ఎవర్నీ ఇబ్బంది పెట్టను.''

ఆయన కళ్లు మూస్కున్నాడు.


''నువ్వు బాగుపడాలని మా ఆశ. మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నావని బాధేమీ లేదు. నేను కూర్చుంటే సరిపోతుందా! నిలబడితే సరిపోతుందా? వాట్ నాన్‌సెన్స్..''

''మీరు కూర్చోండి.''

''వెల్‌కమ్ ఏంటండీ? ఏమనుకుంటున్నారు.''

''ప్లీజ్, మీరు కూర్చోండి.''

సుందరం భుజం మీద ఎవరో చెయ్యి పెట్టారు. అటు తిరిగాడు. అటెండెంట్ ఒకడు అప్పటికే అటెండ్ అయిపోతున్నాడు. ''సార్, మీరు కూర్చోండి. పెద్ద సార్ వస్తాడు..'' సుందరం అమితమైన కోపంలో ఖాళీగా వున్న కుర్చీలోకి వెళ్లి కూర్చున్నాడు. వాకిట్లో నుంచి ఒక స్ట్రెచర్ మీద వీపులో పూర్తిగా కత్తి దిగిపోయిన వ్యక్తిని జాగ్రత్తగా పడుకోపెట్టి గాభరాగా లోపలికి తీసుకుని వెళ్లిపోయారు.




అతను తెల్లని చొక్కాలో ఉండటం చేత రక్తం మరకలు మరీ ఎక్కువగా కనిపించాయి. ఆ కత్తిని కూడా బయటకు తీయలేదు. ఇంద్రజాలం ప్రదర్శించే వాడెవడో ఏదో ఐటం ప్రదర్శించబోయి పొరపాటుగా ఇతన్ని నిజమైన కత్తితో పొడిచేసినట్లుంది. అసలు ఎక్కువగా ఇంద్రజాలం చేసే వారి దగ్గిరకు వెళ్లకూడదు. ఒకవేళ వెళ్లినా అతగాడు స్టేజ్ మీదకు రమ్మంటే ససేమిరా వెళ్లకూడదు అనుకున్నాడు సుందరం.

ఆ వ్యక్తితో వచ్చిన ఇద్దరూ దీర్ఘంగా నిట్టూర్చి సుందరం పక్కన కూర్చున్నారు. సుంరదం వాళ్లని పరామర్శించేందుకు అడిగాడు. ''ఎవరా మెజీషియన్?''

వాళ్ళు ఒకళ్ల మొహాలొకళ్లు చూస్కున్నారు. ''మెజీషియన్ ఎవరండీ. ముఠా తగాదాలలో మేముంటే..'' సుందరం నాలుక కరచుకున్నాడు. ''సార్, తప్పుగా అర్థం చేసుకోకండి. నాకు ఏదో సమస్య ఉందని ఇక్కడ చేర్చారు. నేననుకునేది ఒకటి. అడిగేది మరొకటి. ఇంతకీ ఏం జరిగింది?'

''మా వాడ్ని ఎవరో వెన్నుపోటు పొడిచారండీ. అంత కంటే ఏం లేదు. నమ్మించి మోసం చేశారు.'' సుందరం చేతులు కట్టుకున్నాడు. ''ఎదురు దెబ్బ కూడా ఫరవాలేదు. వెనుకనుండి తగిలినది మనస్సుని మరీ మరీ తాకుతుంది. తలచుకున్నప్పుడల్లా బాధ పెడుతుంది.'' అన్నాడు. ఆ ఇద్దరూ దయ్యం పట్టిన వాళ్లలాగా మొహాలు పెట్టి టీ కోసం ఇవతలకి వచ్చేశారు.

కొద్దిసేపు అక్కడ మరల ప్రశాంతంగా వుంది. ఎవరో కుర్రాడు బుట్టలో ఏపిల్స్ పెట్టుకుని వచ్చి సుందరం పక్కన కూర్చున్నాడు.

''ఆపిల్స్ ఎవరికి?'' సుందరం అడిగాడు. ఆ కుర్రాడు సుందరాన్ని కిందా మీదా చూశాడు. ఆ

చింపిరి గడ్డాన్ని పరిశీలించాడు. విషయం అర్థమయింది.

"నీకు కాదు.." అన్నాడు.

"నాకని నేను అడగలేదు."

"ఇవన్నీ నావే!"

"మీ వాళ్ల కోసం తెచ్చావా?"

"...."

"ఎందుకొచ్చావు?"

"ఇంక రాను."

"నో. నువ్వు రావాలి. అక్కడ బోర్డు చూడు. స్వాగతం పలుకుతోంది. ఆ అమ్మాయికి ఒక ఆపిల్ ఇచ్చెయ్. సంతోషిస్తుంది."

"సార్. నన్నొదిలెయ్యండి. నా బాబాయ్ కూడా మీలాగే మాట్లాడతాడు. లోపల వున్నాడు."

"ఇలా మాట్లాడతాడా? ఏమైంది?"

"వ్యాపారంలో ఆయన భాగస్వామి నమ్మించి మోసం చేశాడు. ఆ షాక్ ఉంచి ఇంకా తేరుకోలేకపోతున్నాడు. వెన్నుపోట్లు బాధాకరమైనవి. ఎవర్నీ నమ్మకూడదు అనిపిస్తుంది."

సుందరం లేచి నిలబడ్డాడు. "సృష్టిలో అన్నీ విచిత్రాలే. ప్రతిఘటనకీ, ప్రతి సంఘటనకీ అద్భుతమైన పోలిక వుంటుంది. జగత్తు సర్వం భగవంతుని మోడర్న్ ఆర్ట్. నువ్వు గుర్తించలేనంత మాత్రాన అది కళ కాదు అనుకోవటం పొరపాటు. ఇందాక వెన్నుపోటుతో ఒకడు లోపలికి వెళ్లాడు. నువ్వు మీ బాబాయికి కలిగిన వెన్నుపోటు గురించి చెప్పావు."

ఆ కుర్రాడు బుర్రపట్టుకున్నాడు. "సార్, ఆస్పత్రి అన్న తరువాత అందరూ ఏదో దెబ్బతోనే వస్తారు. ఏ దెబ్బా లేకపోతే ఆస్పత్రి వాళ్లు దెబ్బ వేస్తారు."

ఒక సిస్టర్ పరుగులు తీస్తూ వచ్చింది.

"ఏంటండీ సుందరం గారూ, చిన్న పిల్లవాడి లాగా? మీ గురించి ఎక్కడని వెతకాలి? రండి. ప్లీజ్. మీరు విశ్రాంతి తీస్కోవాలి?

సుందరం లేచాడు. ఆమె వెనుక కొంతదూరం నడిచాడు. అతని వెనుక ఎవరో అంటున్నారు. "వాడు మెంటలోడన్నమాట. రోజులు బాలేవు. చదువు రానోళ్లు, సగం చదివినోళ్లు, ఎక్కువ చదివేసినోళ్లు ఏంటో నాకు ఇలానే కనిపిస్తున్నారు. అంతా భ్రమ!"

సుందరం వెనక్కి తిరిగాడు. "భ్రమ కాదురా పిచ్చివాడా. సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్న భూమిలా కొందరి హృదయం సృజనాత్మకత చుట్టూ నిరంతరం పరిభ్రమిస్తూ వుంటుంది. ఆ భ్రమర నాదం పిచ్చి వాగుడులా వినిపిస్తుంది. ఒకరికి చేతకానిది మరొకరికి చేతయినప్పుడు దానిని ఒప్పుకోలేక పిచ్చితనం అనే లేబిల్ తగిలిస్తారు. నువ్వు లేబిల్ తగిలించినంత మాత్రాన ఒకడు పిచ్చివాడూ కాడు, మరొకడు తెలివిగలవాడూ కాడు."

సుందరం వార్డులోకి వెళ్లిపోయాడు.

***

రాత్రి బాగా పొద్దు పోయింది. అర్ధరాత్రి దాటింది. సుందరం నిద్ర లోంచి లేచి ఇవతలకు వచ్చాడు. అక్కడ ఒక సిస్టర్ చేతులు కట్టుకుని కుర్చీ లోనే కూర్చుని తూలుతోంది. సుందరం ఆ కారిడార్‌లో నడుచుకుంటూ ఎటో వెళ్లిపోతున్నాడు. ఆమె వెంటనే లేచి అతన్ని వెంబడించింది. అతన్ని పిలిచే లోపల అతనే వెనక్కి తిరిగాడు.

"నన్ను బ్రతకనీయవా?" అడిగాడు.

"సార్, ప్లీజ్, పడుకోండి." సుందరం కాళ్లు ఈడ్చుకుంటూ ఆ కుర్చీదాకా వచ్చాడు. "ఆ వెల్‌కమ్ బోర్డు తీసే వరకూ నీకు నిద్ర పట్టదు. అదేం బోర్డు? అర్థం లేకుండానూ.."

"రేపు ఉదయమే తీయించేస్తాను. మీరు పడుకోండి.." సుందరం లోపలికి వెళ్లిపోయాడు. ఆమె కూర్చోగానే మరల ఇవతలకి వచ్చాడు.

"మీరు పడుకోరా?" అడిగాడు.

"ఇది నా డ్యూటీ."


"మీరు లేచి వుంటే నేను పడుకోను."

ఆమె నవ్వింది. "జోల పాడనా?" అడిగింది.

"అక్కర్లేదు. ఏదైనా కథ చెప్పండి."

ఆమె ఆశ్చర్యంగా చూసింది. ఇతనిలో ఒక చంటి పిల్లవాడు ఎక్కడ దాక్కున్నాడో తెలియదు కానీ ఎందుకో ఆ క్షణంలో కొద్దిగా ముద్దొచ్చాడు.




ఇద్దరూ కుర్చీలు లాక్కుని కూర్చున్నారు. ఫాన్ చప్పుడు ఎక్కువగా వినిపిస్తోంది. ఎవరి బాధతో వారు ముడిబడిపోయి రోగులందరూ నిదురిస్తు న్నారు. కారిడార్ చివర్న వున్న కిటికీలోంచి నిండు చంద్రుడు మబ్బు వెనుక నుండి ఏదో జరగబో తోందని తొంగి చూశాడు.

''నేను చాలా పెద్ద కుటుంబంలోకి కోడలిగా అడుగు పెట్టాను.'' ఆమె చేతులు కట్టుకుని చెబు తోంది. '' మా మామగారు మంచంలో వుండే వారు. నా భర్త తరచూ కాంప్‌లకు వెళ్లే వారు. నన్ను ముసలాయనకు సేవ చేసుకుంటూ ఉండమ న్నారు. నేను చిత్త శుద్ధితో సేవ చేసుకుంటూ వెళ్లాను. నా తోడికోడళ్లూ, ఆడపడుచులూ నేనేదో ఆస్తి కోసం చేస్తున్నట్లు భావించి నన్ను గేలి చేసే వారు. నేను పెద్దగాపట్టించుకోలేదు. ఆ మాట నా భర్త నోటి ద్వారా రానంత వరకూ నేను వాటికి ఏ విలువా ఇవ్వదలచుకోలేదు. అంతలోనే ముసలా యన కాలం చేశాడు. నా భర్త వచ్చి ఎంతో బాధలో ఏమీ మాట్లాడలేదు. ఆస్తి యావత్తూ ఆయన అంద రికీ సమానంగా పంచాడని తెలిసింది. నన్ను అందరూ దూరం చేసి నవ్వుకున్నారు. నా భర్త దగ్గి రగా వచ్చాడు. ''జరగరానిది జరిగింది.'' అన్నాడు.

''బాధపడకండి.'' అన్నాను.

''ఈ నిలకడ లేని ఉద్యోగం వదిలిపెట్టి వ్యాపారం చేయాలనుకున్నాను. ఆ రోజులలోనే ఉద్యోగం లేని నాకు ఆయన ఆస్తంతా వ్రాస్తాన న్నాడు. ఆరోగ్యం క్షీణించాక ఆయనను ఎవరూ చూసుకోరని గాభరాపడి బాగా సేవ చేసిన వారికి వ్రాస్తానన్నాడు. ఈ ఆస్తులేమిటో, ఈ ప్రేమలేమి టో..నువ్వేమిటో...నేనేమిటో...'' ఎందుకో ఒకసారి బయటకి వెళ్లి వచ్చాడు.

''నువ్వు సరిగ్గా చూసుకున్నావా?'' అడిగాడు. నేనేమీ మాట్లాడలేదు. లేచి నాలుగు అడుగులు వేశాను.

వెనకనుండి వినిపించింది.''నువ్వు నన్ను వెన్ను పోటు పొడిచావు. ఆయనా నన్నే పొడిచాడు.''

అయినా నేను మాట్లాడలేదు. నన్ను పెండ్లి చేసుకున్న స్థితిగతులు కత్తుల్లా నన్ను అన్ని కోణాల నుండీ పొడిచినట్లయింది. ఒకరి నిస్వార్థ సేవను శంకించటం కూడా ఒక హత్యతో సమానం. ఒకరి మెప్పును పొందాలని శ్రమించటం ఒక సర్కస్ ఫీట్ అవుతుంది.

''నాకు సమాధానం కావాలి.''

ఇష్టం లేకపోయినా మాట్లాడాను. ''మీ వెనుక నడిచింది వ్యాపారం కోసం కాదు. నాకు కనువిప్పు కలిగింది.''

''బెదిరిస్తున్నావా?''

''ఇల్లంతా వెలుగుతో నిండాలని పూజా మంది రంలో చిరుదీపం వెలిగిస్తాము. అందరి ఇళ్లూ తగల డిపోవాలని ముందర నీ ఇల్లే తగులపెట్టుకునే మని షివి నీవు.''

''బాగానే వెలగబెట్టావు.''

''మరేం ఫరవాలేదు. ఇకపైన గుళ్లో దీపం పెట్టు కుంటాను. లోకం బావుండాలని ప్రార్థిస్తాను నేను బ్రతికుంటే కొందరికైనా ఉపయోగం. నువ్వు నన్ను తాకలేవు.''

నేను వెనక్కి తిరగనూ లేదు. పెట్టె పట్టుకుని బండీ ఎక్కేశాను. ఈ ఆస్పత్రిలో చేరాను. ఇక్కడ ఈ రోగులందరూ నాకు దేవుళ్లతో సమానం. వాళ్లు వెళ్లిపోతూ నన్ను ప్రేమతో ఒకసారి చూస్తారు. నా గాయాలు మానిపోయాయి. వాళ్ల సంతృప్తి నన్ను నడిపిస్తూ వుంటుంది.''

***

ఎందుచేతనో సుందరం ఆస్పత్రిలో ఈమధ్య పుస్తకాలు చదవటం లేదు. ఎక్కువగా మాట్లాడ టమూ లేదు. డాక్టర్లకు మరో సమస్య ఎదురైంది. ఇతను ఎందుకిలా మారాడు? శోధించటం మొదలు పెట్టారు. ఏమీ ఫలితం లేకపోయింది. మానసిక శాస్త్ర నిపుణుడు డాక్టర్ మిత్రా ప్రత్యే కంగా అతని కోసం ఆస్పత్రికి వచ్చారు. ఏవో పరీ క్షలు చేశాడు. ఒకరోజు జోరుగా వాన కురుస్తోంది. డాక్టర్ మిత్రా సుందరం పక్కన కూర్చున్నారు. ముందుగా ఏవేవో మాట్లాడారు. అతను స్పందించ లేదు. ఆయన కొన్ని కాగితాలు ఒక క్లిప్ బోర్డుకు తగిలించి పట్టుకున్నారు.

''సుందరం?'' అన్నారు. ''నాకూ కథలు వ్రాయాలని వుంటుంది. ప్లీజ్ నాకో కథ చెబు తావా?''

సుందరం కొద్దిగా కదిలాడు. బెడ్ మీదనే గోడకి అనుకున్నాడు.

''నెప్పికి మందు రాస్తారు. నెప్పిని ఎలా వ్రాస్తా రు?'' డాక్టర్ నిట్టూర్చారు. వాన జోరుగానే వుంది.

''ఈ కాగితం నీ మనస్సులాంటిది.'' డాక్టర్ అన్నారు. '' ఎంత సున్నితమైనదో గమనించావా? దీని మీద ఒక కలం పట్టుకుని పొలం దున్నినట్లు దున్నుకుంటూ ఇక్కడ నొక్కి, అక్కడ నొక్కి, శిల్ప మనీ, శైలి అని, సంస్కృతమనీ, సాహిత్యమనీ, చరిత్ర అనీ దీనిని బాధపెడుతూనే కలకలం సృష్టించి సకలం చెప్పాలనీ, సముద్రాన్నే మథించా లనీ రచయితలూ, కవులూ జీవితకాలాన్ని గడిపే స్తారు. కాగితానికే ప్రాణం వుంటే నీ కలాన్ని ఏరోజూ దగ్గరకి రానీయదు. ఏమంటావు?''

సుందరం నవ్వాడు. అక్కడ ఆస్పత్రి సిబ్బంది జరుగుతున్న దానికి అయోమయంగా ముఖాలు పెట్టారు.

''డాక్టర్..'' సుందరం చెప్పాడు. ''ఏ గీతలూ లేని తెల్ల కాగితాన్ని పట్టుకుని పిచ్చిగీతలు గీసి అది చిత్తు కాగితం, చెత్త కాగితం అని నిర్ధారించి చెత్తలో కలపకుండా పరిశోధనలు చేయటం... ఒక హింస, ఒక హత్య కాదని అంటారా?''

డాక్టర్ మిత్రా కాగితాలను పక్కన పెట్టారు. సుందరాన్ని జాగ్రత్తగా చూసి కళ్లజోడు తీసేశారు. ఎందుకో తమాయించుకున్నారు. సుందరం ఆయన్ని కూర్చోమని సైగ చేశాడు.

''డాక్టర్, అబద్ధం కూడా నిజం వల్లనే పుడు తుంది. కొద్దిసేపు నిలబడి గాలిబుడగలా అంత రించిపోతుంది. అది ఆరిపోయే ముందు అందరి పబ్బం గడచిపోతుంది. ఈ లోకమంతా ట్రాష్! వాట్‌నాన్‌సెన్స్!''

డాక్టర్ మిత్రా కళ్లు విప్పార్చారు. సుందరం కళ్లు మూసుకుని నిట్టూర్చాడు.

''డాక్టర్, నేను కథ చెబుతాను వ్రాయండి.''

డాక్టర్ పెన్ తీసి కాగితం మీద పెట్టారు. చెయ్యి చిన్నగా వణికింది...

అర్థరాత్రి దాటింది. పిచ్చిదానిలా ప్రవర్తిస్తున్న తన భార్య తంతు ఏమాత్రం అంతు పట్టక డాబా మీదికి చేరుకుని సిగరెట్ ముట్టించాడు. రోడ్డు మీద వాహనాలు అలా పయనిస్తూనే వున్నాయి. ఆకాశం ఎంతో నిర్మలంగా వుంది. రవ్వంత ఆకాశం ఆమె హృదయం లో చోటు చేసుకునే రోజు వస్తుందా అని ఆశగా ఆ నక్షత్రాల వైపు చూశాడు. ఈమెలో ఏవో అర్థంలేని ఆవేదనలు, అర్థంకాని ఆలోచనలు. భయం పుట్టించే మాటలు. ఏ డాక్టరూ ఈమెకు జబ్బు వుందని ఒప్పుకోడు. సాధారణ బలహీనత అంటారు. ఇది నటనా? ఆలోచించాడు. సామాన్య మైన స్త్రీ అయి వుంటే తన మీదకి ఎందుకు ఉరుకు

తుంది? వివాహం జరిగిన రెండోరోజు నుంచే అంత ఉద్రిక్తత ఎలా వస్తుంది? లోకం ముందు సామాన్యంగానే ఎందుకు వుంటుంది? సిగరెట్ పీకకు వున్న నిప్పు కన్నా ఎక్కువగా తన శరీరం మండుతోంది. ఆమెను అప్పుడే చల్లార్చి పడుకో పెట్టి అక్కడికి వచ్చాడు. ఆమె ఏదో మాట్లాడు కుంటూనే వుంది.

డాబామీద మరో అంచు వైపుకు వెళ్లాడు. ఈమె బంధువులందరూ వాళ్లకు సంబంధం లేదని ఎందుకు దూరంగా వుంటారు? వీళ్ళం దరూ మానసిక రోగులేనా? లేక ఈమె తప్పని సరై తనతో కాపురం చేస్తోందా? సిగరెట్ అయిపో యింది. కింద పారేశాడు. మనసుకు చిచ్చు పెట్టు కుని పొగాకును పొగలా త్రాగి తనను తాను ఆలోచనలతో చంపుకోవటం పిచ్చితనమే! ఎందుకో నవ్వుకుని కిందికి దిగిపోయాడు. తన టేబిల్ మీది లాంప్‌ను వెలిగించి ఏదో వ్రాసుకు న్నాడు. వెన్ను పోటు కథలు మూడు వ్రాశాను. వెన్నుపోటు నేనూ పొడిచాను. అన్యాయం! అక్రమం! ఇవి వాళ్ల కథలు కాదు, నిజాలు! నేను ఆ ముగ్గురినీ చంపేశాను. నేనో హంతకుడిని! దుర్మార్గుడిని!''

డాక్టర్ మిత్రా వెనక్కి వాలి కళ్లజోడు సద్దుకు న్నారు. సుందరం మంచి నీళ్ల త్రాగి మరల ప్రారంభించాడు. ''తప్పు లేదు. ఒకరికి పుట్టనిదే అనుభవం ఎక్కడిది? ఘటన లేని కథ ఎక్కడిది? నేను పరికరాన్ని మాత్రమే! కవి ఆ విభుడే. నాపని సింపుల్. నేను చూసిన దృశ్యంలో నేను అదృశ్యమవుతాను. ఆ అంతరంగంలో నేను అంతరించిపోతాను. నేను తరించిపోతాను.'' సుందరం కళ్లు మూస్కున్నాడు. ఎందుకో కన్నీరు జారింది. ఆ రాత్రంతా వాన కురిసింది.

ఉదయమే ఆసుపత్రి ముందు ఒక పోలీస్ జీప్ ఆగింది. వాళ్ల వెనుక సుందరం బాబాయ్, ఇద్దరు లాయర్లు వున్నారు. డాక్టర్ మిత్రా రూములోకి వెళ్లారు. ఆయన ఆశ్చర్యంగా చూశారు. ఇన్స్‌పెక్టర్ కుర్చీ లాక్కుని కూర్చు న్నాడు.

''సుందర్ మీ పేషంటా?'' అడిగాడు.

''అవును.''

''రోగం ఏమిటి?''

''ఇంకా నిర్ధారణ ఆకలేదు. కానీ హైపర్ స్కిజోఫ్రీనియా అని అనుమానంగా వుంది. ఎందుకడుగుతున్నారు.''

'తన భార్యని హత్య చేయబోయాడని ఆరోప ణ- మర్డర్ అటెంప్ట్.!''

''ఎవరి కంప్లయింట్?''

''ఆమెదే..''

డాక్టర్ వెనక్కి వాలి వింతగా నవ్వాడు. ఇన్స్ పెక్టర్ కూడా ఎందుకో నవ్వాడు. తమాయించు కుని అన్నాడు. ''ఆమెను తరచూ హింసిస్తూ వుంటాడని ఆరోపించింది.'' డాక్టర్ మిత్రా చేతులు కట్టుకున్నాడు. ''ఇన్స్‌పెక్టర్, హింస అంటే ఏమిటి అనేది ఎన్ని రకాలుగానైనా చెప్ప వచ్చు..'' అన్నాడు. ''నో. నేను నా పేషెంట్‌ను సమర్థించటం లేదు. మీరు వచ్చిన పని?''

''ఈయన అతని బాబాయ్. అతను మానసి రోగి అని చెప్పాడు. మీరు ఈ కాగితాల మీద ధృవీకరిస్తే మేం మిగతా పన్లు చూసుకుంటాం.''

డాక్టర్‌గారు ఆలోచించారు. సుందరం చెప్పిన కథ టేబిల్ మీదనే వుంది. సింపుల్‌గా సంతకం చేసి పంపించేశాడు. వాళ్లు వెళ్లిపోయారు. సుందరం బాబాయి డాక్టర్ మిత్రా చేతులు పట్టు కుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

''సార్, మావాడు వెర్రివాడు. వాడ్ని ఇలా గైనా బ్రతకనిచ్చినందుకు మీకు ఋణపడి వుంటాం. ఆమె సంగతి వదిలెయ్యండి.''

ఆయన్ని కూర్చోమని సైగ చేశాడు.

''మీరు ఆమెను ఎందుకు నాకు చూపించలే దు?''

''ఆమె బ్రతుకు ఆమె బ్రతుకుతోంది. ఆమెకు ఏ రోగమూ లేదు.''

''వాట్?''

''అవును డాక్టర్. వివాహం సమయానికి బ్రతికున్న ఆమె తల్లి దండ్రులకు తెలియకుండా ఆమెకు ప్రేమ వ్యవహారం వుండేది. వాళ్లు గతించే వరకూ ఈ సంసారం చేస్కుంది. అంత తీవ్రంగా ప్రవర్తిస్తూ వున్నా ఆమె బంధువులు అందుకే ముందుకు రాలేదు. మావాడి మీద అన్ని నేరారోపణలూ దూరం నుండే వేశారు.

''మీరెలా ఊర్కున్నారు?''

''మేం చేయగల్గిందేమీ లేదు. చరిత్ర తెలుసు కున మీ వద్దకు ఇది ఊహించే ఆశ్రయించాం!''

''మీరు సాధించేది ఏమిటి? సుందరాన్ని పిచ్చివాడ్ని చేయటం. అంతేనా?''

''కాదు. ఇతను హంతకుడు అని చాటుకుని ఆమె విడాకులు కోరుకున్నది.''

డాక్టర్‌గారు ఏమీ మాట్లాడలేదు.

***

కొద్ది రోజుల తరువాత సుందరం అక్కడి నుండి డిస్చార్జ్ అయ్యాడు. ఆ రోజే ఎందుకు చేశారో డాక్టర్ మిత్రా ఒక్కరికే తెలుసు. సుందరం పోతూ పోతూ ఆ మెట్ల దగ్గిర ఆగాడు. ''సిస్టర్'' అన్నాడు. 'ఆ వెల్‌కమ్ బోర్డు అలానే వుంచండి. ఒకరిని నొప్పించకుండా, మనం నొచ్చుకోకుండా ఎక్కడికో చొచ్చుకుపోకుండా, ఏ వేషమూ, ఆవే శమూ లేకుండా జీవితం అనే సన్నివేశాన్ని రక్తి కట్టించ గల్గిన వాడు ధన్యుడు. ఆ బోర్డు అలానే వుంచండి. వస్తాను.''

అతను వెళ్లిపోయాక ఆ సిస్టర్ డాక్టర్ గారి వైపు తిరిగి నవ్వబోయింది. ఆయన ఆపారు. ''నో. నవ్వకండి. అతను పిచ్చివాడు కాడు. కానీ అతని జీవితంలో నిన్ననే ఒక సంఘటన జరి గింది. ఈతను ఇక్కడ ఉండగానే కోర్టు వారు ఇతని భార్యకి విడాకులు మంజూరు చేశారు. ఇతని పిచ్చితనాన్ని ఆమె ఆధారంగా చూపించింది.

★


# ఆధునిక దంత వైద్యం

చికిత్సకు ముందు



నల్లగా రంగుమారి, విరిగిన పళ్ళతో ఎంతగానో బాధపడ్డా. ఎన్నోసార్లు ఫిల్లింగ్ చేయించా. ప్రతిసారి ఊడిపోయేది. చల్లటి నీళ్ళు తాగినా జివ్వుమనేది. ఇక నవ్వడం మానేసి కొన్ని సంవత్సరాలైంది.

చికిత్సకు తరువాత



డాక్టర్ని కలిసి స్మైల్ డిజైనింగ్ చేయించు కొన్నా. ఎటువంటి నొప్పి, బాధ లేకుండా ముందు పళ్ళకు చికిత్స చేసి ఎంతో అందం గా మార్చేశారు. ఇప్పుడెంతో హాయిగా నవ్వగల్గుతున్నా!!

## పార్థ దంత వైద్యశాల & రీసర్చి సెంటర్

స్కిల్ స్పెక్ట్రమ్ కాంప్లెక్స్, టిటిడి కళ్యాణ మండపం ప్రక్కన లిబర్టీ సెంటర్, హిమాయత్‌నగర్, హైదరాబాద్
ఫోన్: 040 - 55991010, 9346442644

ఆర్టీసి బస్టాండ్ వెనుక, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, పెద్దకాపు లే ఔట్, తిరుపతి.
ఫోన్: 0877-2250555, 2250105

**FREE ONLINE CLINIC**

- ఎత్తుపళ్ళతో బాధపడుతున్నారా?
- విరిగిన పళ్ళతో నవ్వలేకున్నారా?
- వంకర పళ్ళు మీ చిరునవ్వుని పాడు చేస్తున్నాయా?
- పళ్ళు ముత్యాల్లా మెరవట్లేదా?
- చిగుర్ల నుండి రక్తం కారుతోందా? పళ్ళు వదులౌతున్నాయా?
- మరేవైనా దంత సమస్యలపై అనుమానాలు/ అపోహలున్నాయా?

వెంటనే www.partha.org కి login అవండి. మీ ప్రశ్నలు వివరంగా రాయండి.
24 గం॥ల లోపు ప్రముఖ దంతవైద్యులు, కాస్మటిక్ డెంటిస్ట్ ప్రొ॥ డా॥ పి.వి.పార్థసారధి గారు మీకు సమాధానాలిస్తారు.